# మా తిరుపతి ప్రయాణం

## — చల్లా భాస్కర్ రాం రెడ్డి



నా ఆనందానికి హద్దులు లేవు. అప్పటికి పదిసార్లు చదివాను ఆ ఉత్తరాన్ని- మా అబ్బాయి నుంచీ వచ్చింది.

"ఇంకా ఎన్నిసార్లు చదువుతారు, నాక్కూడా చదివి వినిపించండి" అంది మా ఆవిడ.

"ఏం లేదు! మన అబ్బాయి నుండి వచ్చింది. వాళ్ళు తిరుపతి వెడుతున్నారట- మనవడి తల వెంట్రుకలు తీయించడానికి. అక్కడ నుంచీ మరి కొన్ని పుణ్యక్షేత్రాలకు వెడుతున్నారట మనల్ని వెంటనే హైద్రాబాద్ రమ్మని వ్రాశారు. తిరుపతి ప్రయాణము రేపే. ఈ రోజు సాయంత్రం మనం హైద్రాబాద్ బయలుదేరాలి" అంటూ స్నానం చేయడానికి వెళ్ళాను.

ఉత్తరం వచ్చి పది నిమిషాలు కాలేదు. నేను స్నానం పూర్తిచేసి వచ్చేసరికి, చుట్టుప్రక్కల ఉన్న పది మందికి చెప్పింది మా ఆవిడ- "మేము తిరుపతి వెడుతున్నామని". అయినా తిరుపతి వెళ్ళడం మా వంటి వారికి గొప్పే. ఎందుకంటే దాదాపు పాతిక సంవత్సరాల క్రింద వెళ్ళాము, మా అబ్బాయి తల వెంట్రుకలు తీయించడానికి మళ్ళీ ఇప్పుడు- మనవడి వెంట్రుకలు తీయించడానికి వెళ్ళడం, నాకు చాలా సంతోషంగా వుంది. చచ్చేస రికి మరొకసారి తిరుపతి వెళ్ళాలనుకునే వాన్ని, ఏడుకొండల వాడు ఈవిధంగా తీర్చుతున్నాడు నా కోరికను.

అన్నట్లు- మా అబ్బాయి బ్యాంక్ మేనేజర్. హైద్రాబాద్‌లో ఉంటున్నాడు. వాడు మమ్మల్ని తన తోనే ఉండమన్నాడు. కానీ నాకు ఇష్టం లేదు. ఈ ఊరు, పంట పొలాలను విడిచి ఉండడం, అంతే కాకుండా అక్కడ ఇరుకు గదుల్లో వుండడం నావల్ల కాదు.

ప్రయాణానికి సిద్ధం అవుతున్నాము: మా ఆవిడ మాత్రం ఇప్పట్లో తన పనులను పూర్తిచేసేటట్లు లేదు.

"ఏరా! తిరుపతి వెలుతున్నావటగా. ఎప్పుడు ప్రయాణం" అంటూ శంకరం వచ్చాడు. వాడు నా ప్రాణమిత్రుడు. చిన్ననాటి నుంచి నేటివరకు ఒకరిని విడిచి మరొకరం వుండలేదు.

"నీ వరకు వచ్చిందా, మధ్యాహ్నం అబ్బాయి నుంచి ఉత్తరం వచ్చింది. రేపు వెలుతున్నారట" - అన్నాను నేను.

"అదృష్టం అంటే నీదిరా – ఈ వయసులో పుణ్య క్షేత్రాలు చూడడం కంటే అదృష్టం వేరేమున్నది. మొత్తానికి మీవాడు నిన్ను సుఖపెడుతున్నాడు. మా అబ్బాయి చూడు – కనీసం నా మొహంవైపు కూడా చూడడు. వాడు మనస్ఫూర్తిగా మాట్లాడం నేను ఇప్పటివరకూ చూడలేదు"... చెపుతున్నాడు శంకరం.

"ఉద్యోగం, పెళ్ళి పిల్లలు అయిన తర్వాత ఏ కొడుకూ తల్లిదండ్రుల గూర్చి ఆలోచించరు. ఒక వేళ ఆలోచించినా వారి పిల్లలు ఏడ్చినపుడు ఎత్తుకునే, ఇంట్లో లేనపుడు కాపలాకాసే పని మనుషులుగానే" అంటుంటాడు శంకరం.

కానీ నేను ఈ అభిప్రాయంతో మాత్రం ఏకీభ వించను. మా అబ్బాయిపై నాకు పూర్తి నమ్మకం వుంది. వాడు ఎన్నటికీ అలా చేయడని.

శంకరం నా చేతిలో చిన్న సంచి పెట్టడంతో ఆలోచనల నుంచి తేరుకున్నాను. "నేను తిరుపతి వెళ్ళాలని అనుకునేవాన్ని. హుండిలో వేయడానికి ఇంత డబ్బు పోగుచేశాను. ఎలాగూ నీవు వెలుతు న్నావు కదా – హుండిలో వేయి" అంటూ ఇచ్చి వెళ్ళిపోయాడు. అంతా చిల్లర నాణాలే. ఎప్పటి నుంచి పోగుచేశాడో.

చివరికి, మా ఆవిడ ప్రయాణానికి సిద్ధమ య్యింది. సాయంత్రం నాలుగవుతుంది. చుట్టుప్ర క్కల వారందరికీ మరొకసారి చెప్పి బయలుదే రాము.

హైదరాబాద్ చేరే సరికి రాత్రి తొమ్మిది అయింది. ఇంటికి వెళ్ళేసరికి కొడుకు, కోడలు ప్రయాణానికి కావలసిన ఏర్పాట్లలో ఉన్నారు.

"ప్రయాణం బాగా జరిగిందా నాన్నగారు" అంటు లోపలికి తీసుకెళ్లాడు. తర్వాత భోజనాలకు ఉప



21.6.96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



క్రమించాము.

ఊరి విశేషాలు అడుగుతున్నాడు. తన ఉద్యోగ విషయాలు, పట్నం విశేషాలు చెపుతున్నాడు. ఉన ట్లుండి–

"అమ్మను ఎందుకు తీసుకొచ్చారు. అసలే ఆరోగ్యం బాగా లేనట్లుంది. అయినా వెళ్ళేది రెండు రోజులేగా" అన్నాడు.

నా మనసు చివుక్కుమంది. వాడు అలా ఎందు కన్నాడో అర్థం కాలేదు. వాతావరణం గంభీరంగా మారింది.

"ఎవరు లేకుండా అమ్మ ఒక్కతే అక్కడ ఎలా ఉండగలదురా"! అంటూ మా ఆవిడ మొహంలోకి చూసాను. నేలవైపు చూస్తుంది, ఆమె కళ్లలో సన్నటి నీటి పొర. కదలడం చూసాను.

అయినా ఎవరో కాదుగా అంది– వాడు కొడుకే గదా, దానికి బాధపడడం దేనికి అనుకుంటూ తినడం పూర్తి చేశాను.

ఆ తర్వాత పడక ఏర్పాట్లు జరిగాయి. నేను పడు కున్నానే తప్ప నిద్ర రావడం లేదు. నా మనసంతా తిరుపతి ప్రయాణం పైనే ఉంది. ఎప్పుడు నిద్రపో యానో తెలియదు. మెలకువ వచ్చేసరికి ఉదయం 'ఆరు' అవుతుంది. పది గంటలకు రైలు ఉందని చెప్పాడు. కానీ ఇంకా ఎవరూ నిద్ర నుండి లేవలేదు. నేను స్నానం చేసి మా ఆవిడని లేపాను. ఆ తర్వాత ఒక్కొక్కరు లేచారు. ఆ తర్వాత రెండు గంటలకు ప్రయాణానికి సిద్ధం అయ్యారు. నేను బట్టలు సర్దుతున్నాను. ఊర్లో వారందరికి ఏమేమి తీసుకురావాలో ఆలోచిస్తున్నాను. శంకరం ఇచ్చిన డబ్బుల మూటను ఓవైపుగా పెట్టాను.

ఇంతలో మా వాడు వచ్చాడు. 'నాన్నగారూ! మేము ప్రయాణానికి సిద్ధమయ్యాము. మీరు మాత్రం జాగ్రత్త... పట్టపగలే దొంగతనాలు జరుగుతున్నాయి. పక్కింటి వారినే చూడమని చెప్తామను కున్నాను. కానీ ఈ రోజుల్లో ఎవరినీ నమ్మలేముగా... ఏమీ తోచకుంటే టివి (దూరద ర్శన్) చూస్తుండండి... అయినా మేము వెళ్ళేది రెండురోజులేగా... మా వాడు ఇంటి జాగ్రత్తలన్నీ చెబుతున్నాడు.

నాకు ఇప్పుడు అర్థం అవుతూంది.

"మేము తిరుపతి వెళుతున్నాము. వెంటనే మీరు హైదరాబాద్ రాగలరు" అని ఉత్తరం వ్రాస్తే నాకు అపుడు అర్థం కాలేదు. "అమ్మనెందుకు తీసు కొచ్చారు వెళ్ళేది రెండు రోజులేగా, నాన్నగారు" అన్నా నాకు అప్పుడు అర్థం కాలేదు.

కానీ ఇప్పుడు అర్థం అయింది. శంకరం మాటలు గుర్తుకొస్తునాయి. "ఉద్యోగం, పెళ్ళి, పిల్లలు అయిన తర్వాత ఏ కొడుకు తల్లిందద్రులు గురించి ఆలోచిచడు. ఒకవేళ ఆలోచించినా వారి పిల్లలు ఏడ్చినపుడు ఎత్తుకునే ఇంట్లో లేనపుడు కాపలా కాసే పని మనుషులుగానే"... ◆